సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 51.798 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం 51.798 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.98,510
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.8,945
3శాతం జీఎస్టీతో	రూ.9,213
నవర (8గ్రా)	రూ.73,704

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.1 /28.6

సోమవారం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 67 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



బిట్రగుంట: బోగోలు మండలం తాళ్లూరుకు చెందిన రైతు ఏసు పోగు మొలకయ్య (47) ఆర్థిక ఇబ్బందులతో శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాళ్లూరులో తనకున్న రెండు ఎకరాల భూమిలో మెట్ట పంటలు సాగు చేస్తూ జీవనం సాగించే మొలకయ్య ఇటీవలే తన ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాడు. పిల్లల పెళ్లిళ్లకు చేసిన అప్పులతో పాటు నీటి వసతి లేని పొలంలో బోరు వేయించేందుకు ఇటీవల తెలిసిన వారి వద్ద కొంత అప్పు చేశాడు. బోర్లలో నీళ్లు పడకపోవడం, అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో శనివారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన తొలుత నెల్లూరుకు, అనంతరం చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు బిట్రగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ 2025–26 నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. 44వ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నగరంలోని డీఎస్‌ఆర్ ఇన్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.రామకృష్ణ, కార్యదర్శిగా కె.శ్రీనివాసులురెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎం.మస్తానయ్య, కోశాధికారిగా ఎం హజిత్ యాదవ్, కౌన్సిలర్‌గా అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు క్రికెట్ సంఘం ఎన్నికల అధికారి బి.వెంకటస్వామి ప్రకటించారు. జిల్లా క్రికెట్ సంఘ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్‌గా పి.భానుప్రకాష్‌రెడ్డిని 31 మంది క్రికెట్ సభ్యులు ప్రత్యేకంగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశాన్ని నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కేర్ టేకర్ డి.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

బీచ్ కబడ్డీ జిల్లా పురుషుల జట్టు ఎంపిక

చినగంజాం: ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక ఆదివారం స్థానిక ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో జరిగింది. మే 2వ తేదీ నుంచి కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొననున్నట్లు అంతర్జాతీయ క్రీడాకారుడు, కోచ్ ఎం.గిరిబాబు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్టుల ప్రయాణ, ఇతర ఖర్చుల మొత్తాన్ని చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. చినగంజాంలో గత 15 ఏళ్లుగా స్వచ్ఛందంగా కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్న బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ క్రీడాకారుడు మరపాల గిరిబాబు, క్లబ్ కార్యవర్గ సభ్యులను ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అభినందించింది. బీచ్ కబడ్డీ జట్టు ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ కుర్రా భాస్కరరావు, కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, ట్రజరర్ డీ రమేష్, మేనేజర్ బీ నాగాంజనేయులురెడ్డి పాల్గొన్నారు.

పురుషుల జట్టు

గాలి లక్ష్మారెడ్డి, జీ సమరసింహారెడ్డి, జీ బాలకృష్ణారెడ్డి, కే వెంకటేష్, వై రాజశేఖరరెడ్డి, కే ప్రసాద్‌రెడ్డి, బీ భరత్ రెడ్డి, కే హరిప్రసాద్‌రెడ్డి, కే రామాంజిరెడ్డి, జీ లక్ష్మారెడ్డి, పీ బ్రహ్మారెడ్డి, బీ సురేష్ రెడ్డి, ఎస్ ఉమామహేశ్వరరావు, పీ వినీత్‌రెడ్డి, కే బ్రహ్మయ్యతో జట్టు ఏర్పాటు చేశారు.

తీరంపై 'పెట్రో' పిడుగు

ప్రకృతిని పరవశించే పచ్చని పంట పొలాలు. ఊరూరితో మమేకమైన పల్లెసీమలు. తొలిపొద్దు అక్కడి నుంచి ప్రారంభమైనట్లు కనిపించే సముద్రం. అలల సవ్వడితో పరవశించే 'తీరం'లో పెట్రో పిడుగు పడనుంది. ఈ ప్రాజెక్ట్ రూపకల్పన జరిగితే ఇప్పుడు కనిపించే సుందర, మనోహర దృశ్యాలు ఇక కనిపించవు. వ్యవసాయం, పాడి, కల్లుగీత పనుల్లో నిమగ్నమైన పల్లె జనం. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పూలు, వేరుశనగ, చేమ, మామిడి తోటలతో అలరారే మండలంలోని చెన్నాయపాళెం, ఆనెమడుగు, సర్వాయపాళెం, పెద్దపట్టపుపాళెం గ్రామ సీమలు కనుమరుగు కానున్నాయి.



భూసేకరణ చేసే గ్రామాల్లో ఉన్న పచ్చని పొలాలు



- 6 వేల ఎకరాల భూసేకరణ ప్రక్రియ
- ఈ ప్రాజెక్ట్‌లో పచ్చని పొలాలు, నివాసాలు గల్లంతు
- మార్కెట్ ధర చెల్లించేందుకు బీపీసీఎల్ సిద్ధం
- ప్రభుత్వ విలువ చెల్లించి మిగతా కాజేసేందుకు కొందరు పన్నాగాలు

రామాయపట్నంలో ఆయిల్, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు సన్నాహాలు



కావలి: కావలికి సమీపంలోని రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా సముద్ర తీరం వెంబడి అయిల్ రిఫైనరీ కం పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను బీపీసీఎల్ చేపట్టడానికి సన్నాహాలు చేస్తోంది. ఏటా తొమ్మిది మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఈ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతిపాదించింది. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్రమోదీ ప్రభుత్వం మహారాష్ట్రలోని రత్నగిరిలో రూ.3 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 60 మిలియన్ టన్నుల మెగా ఆయిల్ రిఫైనరీ కం పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని భావించింది. కానీ భూ సేకరణ సమస్య కారణంగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్ట్‌ను రామాయపట్నం పోర్టు సమీపంలో ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాలు, సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక, స్థల పరిశీలన, భూసేకరణ, పర్యావరణ ప్రభావం, ఇంజినీరింగ్ డిజైన్లు తదితర కార్యక్రమాలకే సుమారు రూ.6,100 కోట్లు ఖర్చు చేయనున్నట్లు సమాచారం. వచ్చే డిసెంబర్‌లో డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్), ఫీడ్ బ్యాక్, అధ్యయనాల నివేదికలు వచ్చిన తర్వాత మొత్తం ప్రాజెక్ట్ ఖర్చు ఎంత ఉంటుందో అంచనాకు రానున్నారు. జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలని బీపీసీఎల్ పరిశీస్తోంది. తుది ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయం తీసుకున్న తర్వాత 48 నెలలకు ప్రాజెక్ట్‌లో కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు సుమారు 6 వేల ఎకరాల భూమి అవసరం అవసరం కానుండడంతో ఈ మేరకు భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చాపకింద నీరులా చేస్తోంది. ఇందుకు అవసరమైన భూముల్లో సుమారు 4 వేల ఎకరాలు పట్టా భూములు, 2 వేల ఎకరాలు ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములు కలిపి సేకరించే పనిలో ఉంది.

భూసేకరణే అసలు సమస్య

మహారాష్ట్రలో భూసేకరణలో ఎదుర్కొన్న అనుభావాలను దృష్టిలో పెట్టుకుని బీపీసీఎల్ కావలి మండలంలో భూసేకరణకు అవరోధాలు తలెత్తకుండా చేయాలని భావిస్తోంది. ఆ మేరకు ఎకరాకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు వరకు నష్టపరిహారంగా చెల్లించడానికి ఆ సంస్థ సిద్ధంగా ఉంది. అయితే తద్వారా ఆర్థిక ప్రయోజనాలు ఆశిస్తున్న కొందరు రంగ ప్రవేశం చేశారు. భూసేకరణలో కుయుక్తులు పన్నుతున్నాయి. ఎకరాకు ప్రభుత్వ ధరకు అటుఇటుగా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల మేర నష్టపరిహారం చెల్లించి మిగతాది తమ జేబుల్లో వేసుకునేందుకు సదరు వ్యక్తులు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. అయితే రైతులు మాత్రం ఎకరాకు రూ.50 లక్షలు నష్టపరిహారంగా ఇచ్చినా తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తెగేసి చెబుతున్నారు.

1,348 కోట్ల లీటర్ల నీరు అవసరం

అయిల్ రిఫైనరీకి నీటి అవసరం అత్యధికంగా ఉంటుంది. ఈ ప్రాంత రైతులకు అవసరమైన సాగు నీటిని అందించడానికి తరతరాలుగా నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు, ఇప్పుడు ఆగమేఘాలపై సోమశిల ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేస్తామని ప్రకటించింది. చమురు శుద్ధి కర్మాగారం/ పెట్రోలియం శుద్ధి కర్మాగారం అనేది ఒక పారిశ్రామిక/రసాయన ప్రాసెసింగ్ ప్లాంట్. ఇక్కడ ముడి చమురును పెట్రోల్, గ్యాసోలిన్, డీజిల్ ఇంధనం, తాపన నూనె, కిరోసిన్, గ్యాస్, జెట్ ఇంధనంగా మారుస్తారు. ఆయిల్ శుద్ధి కర్మాగారాలు పెద్ద మొత్తంలో నీటిని ఉపయోగిస్తాయి. సాధారణంగా ఒక బ్యారెల్ (159 లీటర్లు) ముడి చమురును ప్రాసెస్ చేయడానికి 1.5 బ్యారెళ్ల నీరు అవసరం. ఈ ఆయిల్ శుద్ధి కర్మాగారంలో 9 మిలియన్ టన్నుల ఆయిల్ శుద్ధికి సుమారుగా 1,348 కోట్ల లీటర్లు అవసరం అవుతుంది. ఒక టీఎంసీ (2,831 కోట్ల లీటర్లు). అంటే ఇక్కడి వినియోగానికి ఏటా సుమారుగా అర టీఎంసీ నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో..

నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసే దిశగా కావలిలో మెగా ఇండస్ట్రియల్ హబ్ కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. తుమ్మలపెంట, మన్నంగిదిన్నె పంచాయతీల్లోని గ్రామాల్లో 3,500 ఎకరాలు భూసేకరణ చేయాలని తలపోసింది. రామాయపట్నం ఓడరేవుతో అనుసంధానించబడిన ప్రధాన పరిశ్రమలు అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా, కీలకమైన ఎగుమతి ద్వారంగా అభివృద్ధి చేయడంతోపాటు దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యం కోసం సమర్థ వంతమైన లాజిస్టిక్స్‌పై ఆధారపడే పరిశ్రమలకు ఈ ప్రాంతం ప్రధాన ప్రదేశంగా మారుతుందని బ్లూ ప్రింట్ తయారు చేశారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా కాలుష్యభూతమైన పెట్రో శుద్ధి కర్మాగారం, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను నిర్మించడానికి భూసేకరణ చేస్తున్నారు.

"రైతులకు వాటాలివ్వాలి"



బీపీసీఎల్ ప్రాజెక్ట్ కోసం కావలి మండలంలో ప్రభుత్వం చేస్తున్న భూసేకరణలో భూమి కోల్పోయే రైతులకు పరిశ్రమల్లో వాటాలు ఇవ్వాలి. బీపీసీఎల్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. ప్రభుత్వ సంస్థ అంటే ప్రజలదే. అదే ప్రజలకు ప్రాజెక్ట్‌లో వాటాలు ఇవ్వడానికి అభ్యంతరాలు ఎందుకు. ఇవి ఎలాగో చేయరు. కాబట్టి మార్కెట్ ధర కన్నా పది రెట్లు ఎక్కువ ఇవ్వాలి. భూసేకరణ మొత్తం రహస్యంగా సాగుతోంది. ఇందులో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశాలు లేవు.

– దామా అంకయ్య, సీపీఐ కార్యదర్శి, నెల్లూరు జిల్లా

వాయు, జల కాలుష్యం తప్పదా?

ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్ట్‌లో రసాయన ప్రక్రియలు ఉంటాయి. ఇవి పర్యావరణాన్ని కలుషితం చేస్తాయి. రసాయన ఉద్గారాలతో విడుదలయ్యే విష వాయువుల కారణంగా వాయు, జల కాలుష్యానికి కారణమవుతాయి. ఈ వాయువులు హానికరం, తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. కాలుష్యం కారణంగా ఈ గ్రామాల సమీపంలో ఉండే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. పిల్లలకు శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా సోకుతాయి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు నిజమేనా?

రైతులకు, గ్రామాల్లో నివసించే ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ గ్యారెంటీ లేదు. రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో కొందరికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించమని నవయుగ నిర్మాణ సంస్థను ఆ ప్రాంత ఎమ్మెల్యే అడిగితే వీలు పడదని తెగేసి చెప్పినట్లు సమాచారం. సుశిక్షతులైన కార్మికులు, ఉద్యోగులు తమకు అందుబాటులో ఉన్నారని, స్థానికులకు ఈ పనుల్లో అవగాహన లేదని, అందుకే స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వలేమని ఎన్‌సీసీ ప్రతినిధులు స్పష్టం చేశారంట. అలాంటి బీపీసీఎల్‌లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయనే ప్రచారం ఆచరణ సాధ్యమయ్యే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఛత్రపతి శివాజీసేన

నెల్లూరు (బృందావనం): హిందుస్థాన్‌గా పిలవబడే భారతదేశంలో హిందువులు ప్రాణ భయంతో పారిపోయే దుస్థితి రావడం చాలా బాధాకరమని, హిందువులపై జరుగుతున్న దాడులు దారుణమని ఛత్రపతి శివాజీసేన అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో హిందువులపై జరిగిన మారణకాండను నిరసిస్తూ ఆదివారం సాయంత్రం నగరంలోని ట్రంకురోడ్డు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఛత్రపతి శివాజీసేన, హిందూసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాకు మురళీరెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ చట్టంపై నిరసనలకు హిందువుల ఇళ్లపై దాడులు చేయడానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బెంగాల్‌లోని ముర్షిదాబాద్ పాకిస్తాన్ కన్నా ప్రమాదకరమైన ప్రాంతంగా మారిందన్నారు. హిందువుల ధన, మాన ప్రాణాలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులను ఇంటి నుంచి బయటకులాగి హతమార్చడం, మహిళలపై అత్యాచారాలు, ఆస్తులు లూటీ చేయడం చేస్తుంటే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం శాంతిభద్రతలను పరిరక్షించడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. హిందువులలో ఐక్యత లేనందునే మొన్న బంగ్లాదేశ్‌లో నిన్న బెంగాల్‌లో దాడులు జరిగాయన్నారు. హిందువులు సంఘటితం కాకున్నా, మేల్కొనకుంటే ఈ ఉన్మాద దాడులు దేశమంతా వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. మతఛాందస వాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఛత్రపతి శివాజీ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. శివాజీ సెంటర్‌లోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో శివాజీసేన గౌరవ అధ్యక్షుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి, కార్యదర్శి మధురెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్‌చౌదరి, సభ్యులు పెరుమాళ్, స్వామి, మోహన్‌రెడ్డి, హిందూ చైతన్య వేదిక నాయకులు నాగ శ్రీనివాస్, పీజీ మహేష్, సాల్లేటి వెంకటేశ్వర్లు, యశ్వంత్, సుధీర్, మహిళా నాయకులు లక్ష్మి, కృష్ణవేణి, మాధవి, వీహెచ్‌పీ నేతలు, హిందూ సంఘాల నేతలుపాల్గొన్నారు.

వెంకటగిరికి చేరిన రవితేజ పార్థివదేహం

వెంకటగిరి రూరల్: అమెరికాలో గత ఆదివారం మృతి చెందిన వెంకటగిరి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సాయివరప్రసాద్ కుమారుడు రవితేజ (35) పార్థివదేహం ప్రత్యేక విమానంలో చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరింది. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు వెంకటగిరికి తీసుకొచ్చారు. వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్, వెంకటగిరి, గూడూరు, నెల్లూరు ప్రాంతాల్లోని పలువురు న్యాయవాదులు వెంకటగిరికి చేరుకుని రవితేజ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబ్జి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మా భూములిచ్చే ప్రసక్తే లేదు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

- ఉప్పరపాళెం ఎస్సీ, ఎస్టీల ఏకగ్రీవ తీర్మానం

ఉలవపాడు: ఇండో సోలార్ కంపెనీకి కారు చౌకగా ఎస్సీ, ఎస్టీల భూములు తీసుకోవాలని ప్రభుత్వం చూస్తోందని, కానీ మా భూములిచ్చే ప్రసక్తే లేదని కరేడు రెవెన్యూ పరిధిలోని ఉప్పరపాళెం ఎస్సీ, ఎస్టీ రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం స్థానిక ఎంపీపీ స్కూల్‌లో రామకృష్ణాపురం, ఉప్పరపాళెం, పాట్టినుగుంట రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా నేత కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న భూసేకరణపై ఎస్సీ, ఎస్టీలకు ఉన్న భయాందోళనలను అధికారులు తొలగించాలని కోరారు. పరిశ్రమల పేరుతో బలవంతంగా భూసేకరణ చేస్తే ఎలా అన్నారు. భూములు, ఇళ్లు పోతే నిరాశ్రయులుగా మారుతారన్నారు. తక్షణమే బలవంతపు సేకరణ ఆపి ప్రజల్లో ఉన్న భయాందోళనలను నివృత్తి చేయాలన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాసితుల సమన్వయ కమిటీ తరఫున గంజి యలమంద, సుదర్శి మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు రామలక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు గంజి శ్రీనివాసులు, రామకోటయ్య, గిరి, విజయ్, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు నాగార్జున, సుజాత, అంకమ్మరావు, ఐద్వా నాయకులు లలితమ్మ, పెంచలమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌తో 570 యూనిట్ల ఉత్పత్తి

మిగులు విద్యుత్ యూనిట్ లెక్కన అమ్ముకోవచ్చు



అవగాహన కలిగిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్ ద్వారా ఉచిత విద్యుత్ పొందడంతో పాటు మిగులు విద్యుత్‌ను అమ్ముకోవచ్చని ఆ శాఖ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ అన్నారు. నగరంలోని రామూర్తినగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్‌లో ఆదివారం సోలార్ వినియోగదారులకు అవగాహన కలిగించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ ప్యానల్ ద్వారా రోజుకు 19 యూనిట్ల చొప్పున నెలకు 570 విద్యుత్ యూనిట్లు ఉత్పత్తి అవుతోందని, ఇంటి అవసరాలకు వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను యూనిట్ల లెక్కన విద్యుత్ సంస్థలకు అమ్మకం చేసుకోవచ్చన్నారు. సోలార్ ప్యానల్స్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లు ఆదాతోపాటు, నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు టౌన్–2 విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సునీల్‌కుమార్, సోలార్ వినియోగదారులు నారాయణరావు, చంద్రమోహన్‌రెడ్డి, బషీర్, రమణయ్య, సిబ్బంది ప్రసాద్, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



బహుమతులు అందించిన బషీర్

రాపూరు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని రాపూరు ఆర్టీసీ డిపో ఎస్‌టీఐ బషీర్ అహ్మద్ అన్నారు. రాపూరు ఆర్టీసీ డిపో నుంచి వెంకటగిరి, గూడూరు మార్గంలో రాకపోకలు సాగించిన ప్రయాణికులకు సంబంధించి లక్కీ డ్రా తీశారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. బస్సు దిగే సమయంలో టికెట్‌పై ఫోన్ నంబర్, చిరునామా రాసి బాక్స్‌లో వేస్తే 15 రోజులకు లక్కీ డ్రా తీసి నలుగురిని ఎంపిక చేసి బహుమతులు అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 45.838 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 45.838 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,040, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

- ఐదుగురు ప్రయాణికులు సురక్షితం



కాలువలో కారు

మనుబోలు: మండల పరిధిలోని వడ్లపూడి గ్రామ సమీపంలో ఆదివారం కారు అదుపు తప్పి కనుపూరు కాలువలోకి దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీ రాజుపాళెం గ్రామానికి చెందిన అట్ల రమణారెడ్డి మూడు రోజుల క్రితం కొత్త కారు కొనుగోలు చేశాడు. శనివారం కుటుంబ సభ్యులతో గొలగమూడికి వెళ్లి పూజ చేయించాడు. రాత్రి నిద్ర చేసిన కుటుంబం ఆదివారం ఉదయం స్వగ్రామానికి బయలుదేరింది. వడ్లపూడి మలుపులో పిట్టగోడ లేని వంతెన వద్ద కారు అదుపుతప్పి కనుపూరు కాలువలోకి దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్రేన్‌తో కారును బయటకు తీశారు.

ప్రజలకు నిజాల్ని వివరించాలి

- ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

నెల్లూరు రూరల్: 'ప్రధాని నరేంద్రమోదీ పాలనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని బీజేపీ కార్యకర్తలు తిప్పి కొట్టాలి. ప్రజలకు నిజాలు వివరించాలి' అని ఆదోని ఎమ్మెల్యే, బీజేపీ నేత డాక్టర్ పీవీ పార్థసారథి అన్నారు. నెల్లూరు నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న ఇంద్రావతి మినీ ఫంక్షన్ హాల్లో ఆదివారం మేధావుల సదస్సు నిర్వహించారు. భారతరత్న అంబేడ్కర్ జయంతిని జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందన్నారు. కాంగ్రెస్ న్యాయవ్యవస్థను తమ స్వప్రయోజనాలకు వాడుకుందన్నారు. నిజాయితీ గల న్యాయమూర్తులను బదిలీల పేరుతో వేధించిందన్నారు. నేతలు వంశీధర్‌రెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కందికట్ల రాజేశ్వరి, విల్సన్, ఏవీ రెడ్డి, సందీప్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 100
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 184
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 204
లేయర్ చికెన్ : 170

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.65
పండ్లు	: రూ.40

మట్టి కుండలకు క్రేజ్



ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మట్టి కుండలకు గిరాకీ ఏర్పడింది. చలివేంద్రాల్లోనూ వాటిని ఏర్పాటు చేస్తున్నారు. తయారీదారులు కుండలకు కుళాయిలు బిగించి విక్రయిస్తున్నారు. నెల్లూరు నగరంలోని కొండాయపాళెం గేటు సమీపంలో కుండల్ని సిద్ధం చేస్తుండగా తీసిన చిత్రం.

భద్రం బ్రదరూ..



కొందరు వాహనదారులు ఇష్టారాజ్యంగా తిరుగుతుంటారు. ప్రమాదమని తెలిసినా పట్టించుకోరు. ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలు లోడు చేసుకుని వాటిని తాళ్లతో కట్టకుండా రైస్‌మిల్లుకు తీసుకెళ్తున్నారు. ఆ బస్తాలపై మనుషులు కూడా కూర్చొని ప్రమాదకర స్థితిలో నెల్లూరులో వెళ్తుండగా తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పుచ్చ రైతు డీలా!



కిలో కేవలం రూ.4కే కొంటున్న దళారులు

- పొదలకూరు మండలంలో 200 ఎకరాల్లో సాగు
- ఎక్కడ చూసినా పుచ్చకాయల రాసులే
- ఈ ఏడాది కలిసి రాని సాగు

ప్రస్తుతం రైతాంగం పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. వరి పండించిన అన్నదాతలు ధరల్లేక ఇటీవల తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. నేడు పుచ్చ సాగు చేసిన వారు నష్టపోయారు. ఈ ఏడాది సాగు కలిసి రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే పుచ్చ చేలను వదిలివేశామని, గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రాలేదంటున్నారు.



అమ్మకానికి తెచ్చిన పుచ్చకాయలు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు మండలంలో మొగళ్లూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి, ఇనుకుర్తి, ముదిగేడు, పులికల్లు, ఊసపల్లి, వావింటపర్తి తదితర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో పుచ్చ సాగు చేపట్టారు. కేవలం 70 నుంచి 80 రోజుల్లో పంట చేతికందే పుచ్చ సాగులో గతేడాది రైతులు బాగానే ఆదాయాన్ని చవిచూశారు. దీంతో ఈ ఏడాది కూడా ఆదాయం ఉంటుందని భావించి విస్తీర్ణం పెంచారు. అయితే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్టాల బాట పట్టాల్సి వచ్చిందని వెల్లడిస్తున్నారు. కొందరైతే తోటల్లో కాయలను వదిలివేయడంతో చుట్టుపక్కల గ్రామాల వారు కోసుకుని వెళ్తున్న పరిస్థితులున్నాయి. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు రైతులు పెట్టుబడులు పెట్టారు. మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తే మరో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు అదనంగా సాగు ఖర్చులు పెరిగినట్టు తెలిపారు.

చాలా తక్కువ ధర

రైతుల నుంచి దళారులు కిలో రూ.4కే కాయలను అడుగుతున్నారు. ఈనెల మొదటి వారంలో కిలో రూ.7 లెక్కన కొనుగోలు చేసిన దళారులు ఇప్పుడు రూ.4కే అడుగుతుండటంతో రైతులకు కడుపు మండి ఇవ్వకుండా వదిలేస్తున్నారు. మార్కెట్లో సైతం పుచ్చ ధరలు బాగా తగ్గించి అమ్ముతున్నారు. రోడ్లపై రాసులుగా పోసిన కాయలు దర్శనమిస్తున్నాయి. రూ.100కు 15 కిలోల పుచ్చకాయలు అందజేస్తున్నారు. ఈ ప్రాంతంలో రెండు రకాలు పండించారు. నల్లరంగు, పచ్చ చారల రంగు పుచ్చ కాయలను రైతులు దిగుబడి చేశారు. నల్లరంగు కాయలు వారం రోజుల వరకు నిల్వ ఉండే అవకాశం ఉంది. చారలున్న కాయలు రెండు, మూడు రోజులకే దెబ్బతింటున్నందున తోటల్లో కాయలను కొనుగోలు చేసేందుకు దళారులు సైతం సాహించలేకపోతున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



తోటలో వదిలేసిన కాయలు

తీవ్రంగా నష్టపోయాం



పుచ్చ సాగు వల్ల తీవ్రంగా నష్టపోయాం. గతంలో ఎన్నడూ లేని విధంగా సాగులో నష్టాలొచ్చాయి. అడిగేవాడు లేకుండాపోవడంతో రెండెకరాల్లో సాగు చేసి వదిలేయడం జరిగింది. అడిగిన వారికి ఉచితంగా కూడా కాయలను అందజేస్తున్నాను. దళారులు అడిగే ధరలకు ఇవ్వడం కంటే చట్టుపక్కల రైతులకు పంచిపెట్టడం మేలనిపిస్తోంది.
– సీహెచ్ రమేష్, రైతు, నావూరుపల్లి

స్వగ్రామానికి వెళ్తుండగా..

- చెట్టును ఢీకొట్టిన మోటార్‌బైక్
- ఘటనా స్థలంలో యువతి, చికిత్స పొందుతూ యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మర్రిపాడు: పెంచలకోనకు వెళ్లి దైవ దర్శనం చేసుకుని స్వగ్రామానికి వెళ్తుండగా మోటార్‌బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో యువతి ప్రమాద స్థలంలోనే మృతిచెందగా.. యువకుడు చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కదిరి నాయుడుపల్లి వద్ద జాతీయ రహదారి – 67పై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం ముత్తుకూరుకు చెందిన మల్లి నరసింహులు (26) ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. పట్టణంలోని రూపరాంపేటకు చెందిన యాడగాలి ఝాన్సీ (26) కూడా అక్కడే పనిచేస్తోంది. ఇద్దరూ కలిసి శనివారం సాయంత్రం బద్వేలు నుంచి బైక్‌పై పెంచలకోనకు వెళ్లారు. అక్కడ దైవ దర్శనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం బద్వేలుకు బయలుదేరారు. కదిరినాయుడుపల్లి సమీపానికి వచ్చేసరికి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో వెనుక కూర్చొన్న ఝాన్సీ అక్కడికక్కడే మృతిచెందింది. నరసింహులును 108 అంబులెన్స్‌లో బద్వేలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మర్రిపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టాటా మ్యాజిక్‌ను ఢీకొన్న టిప్పర్



దెబ్బతిన్న వాహనం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని చంద్రపడియ సమీపంలో ఇసుక తరలిస్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొట్టిన ఘటన ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కాలేషా తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆత్మకూరు – వింజమూరు రోడ్డు మార్గంలో అధికలోడుతో టిప్పర్లు ఇసుకను తరలిస్తున్నాయి. అతివేగంగా రాకపోకలు సాగిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పోలీసులు అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్లను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్పీ ఆదేశాలతో తనిఖీలు ముమ్మరం



లాడ్జీలో బస చేసిన వారి వివరాలు సేకరిస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు



వేలిముద్రలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు



తనిఖీలు చేస్తున్న సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు లాడ్జీల్లో తనిఖీలు చేశారు. వాహనదారుల పత్రాలను పరిశీలించి నిబంధనల ఉల్లంఘనులపై కేసులు నమోదు చేశారు. జరిమానాలు విధించారు. జిల్లా వ్యాప్తంగా 96 లాడ్జీల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. బస చేసిన వ్యక్తులు వివరాలను తెలుసుకున్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, బస చేసిన వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అందజేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. లాడ్జీ పరిసర ప్రాంతాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 30 మందిపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 70 మందికి రూ.43,080 జరిమానాలు విధించారు. రికార్డులు, నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

వివరాల సేకరణ

నెల్లూరు నగరంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ పి.సింధుప్రియల పర్యవేక్షణలో అధికారులు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఫింగ్స్ సహాయంతో వేలిముద్రలను పరిశీలించారు. మందుబాబులు, అల్లరిమూకలపై కొరడా ఝుళిపించారు. అర్ధరాత్రి పలువురు బైక్‌లపై వెళ్తుండగా ఆపి వివరాలు సేకరించారు. అనవసరంగా రాత్రివేళల్లో రోడ్లపై తిరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, హోటల్స్, దుకాణాలు నిర్ణీత వేళల్లోనే మూసివేయాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విజిబుల్ పోలీసింగ్ ముమ్మరం చేయాలని ఈ సందర్భంగా ఏఎస్పీ తెలిపారు. నెల్లూరు నగరంలో చిన్నబజారు, సంతపేట, దర్గామిట్ట, బాలాజీ నగర్, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, దశరథరామారావు, రోశయ్య, సాంబశివరావు, వెంకటరెడ్డి, ఎస్సైలు, సిబ్బంది తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

డ్రోన్లతో నిఘా

డ్రోన్లతో నెల్లూరు శివారు ప్రదేశాలను పరిశీలించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 70 మందిపై కేసులు నమోదు చేశారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో డ్రోన్లతో నిత్యం నిఘా ఉంచినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు, నదీ తీరాల్లో డ్రోన్లతో నిఘా పెట్టామన్నారు. ఓపెన్ డ్రింకింగ్, పేకాట, మత్తు పదార్థాల వినియోగంపై చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి సేవించడం, అమ్మడం, రవాణా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

పశువైద్యులకు క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న అధికారులు, పశువైద్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం పశువైద్యులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఆ శాఖ జిల్లా జేడీ రమేష్ నాయక్ పోటీలను ప్రారంభించారు. ప్రపంచ పశువైద్యుల దినోత్సవ నేపథ్యంలో వీటిని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఆర్చరీ, వాలీబాల్, త్రో బాల్, టెన్నిస్, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ నాగమణి, డాక్టర్ శ్రీధర్, రాష్ట్ర పశువైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.జయప్రకాష్, డాక్టర్ కృష్ణమౌర్య, డాక్టర్ బొడ్డు ప్రసాద్, డాక్టర్ చైతన్య కిశోర్, డాక్టర్ కె.అరుణ, డాక్టర్స్ ఫార్మా ఎండీ డాక్టర్ సి.చలమయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఊడిన పెచ్చులు



నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరింది. ఆదివారం స్లాబ్ పెచ్చులూడి కింద పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల పెచ్చులు ఊడిపడటంతో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.